సాక్షి నంద్యాల

శుక్రవారం ၊ 26 ၊ జనవరి ၊ 2024

I



..పేదలకు సర్వ హక్కులు

ఇళ్ల స్థలాలపై పేదలకు రాష్ట్ర ప్రభుత్వం సర్వ హక్కులు కల్పిస్తోంది. ఇందుకోసం ఈనెల 27 నుంచి ఫిబ్రవరి 9వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపడుతోంది.

IIలో▸



భ్రామరీకి లక్ష కుంకుమార్చన

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబాదేవికి గురువారం పౌర్ణమి సందర్భంగా లక్ష కుంకుమార్చన సేవను నిర్వహించారు. క్షేత్రానికి రాలేని భక్తులు వారి గోత్రనామాలతో పరోక్షసేవగా పాల్గొన్నారు.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ పథకానికి హైదరాబాద్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్ రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు.

న్యూస్‌రీల్

భక్తి శ్రద్ధలతో అహోబిలేశునికి పూజలు



పల్లకీలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

రుద్రవరం: అహోబిల పార్వేట ఉత్సవమూర్తులైన జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాద వరద స్వామికి ఆలమూరు ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. పార్వేట ఉత్సవాల్లో భాగంగా గురువారం గ్రామ తెలుపులపై కొలువు దీరిన స్వామి ఆయా కాలనీల ప్రజలు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. గ్రామంలో తిరునాల అంగళ్లతో సందడి నెలకొంది.

12 మంది ఎస్‌ఐలకు పదోన్నతి



పదోన్నతి అనంతరం డీఐజీని కలసిన ఎస్‌ఐలు

కర్నూలు: ఉమ్మడి కర్నూలు జిల్లాలో 12 మంది ఎస్‌ఐలకు సీఐలుగా పదోన్నతి లభించింది. పదోన్నతి పొందిన వారిలో ఎ.జయన్న, సి.నల్లప్ప, ఎ.వేణుగోపాల్, ఎల్.విజయలక్ష్మి, ఎం.రామయ్య, డి.మస్తాన్ వలి, ఎ.రామకృష్ణయ్య (కర్నూలు జిల్లా), సుబ్బరామిరెడ్డి, బాబు, సి.ఎం.రాకేష్, మారుతి శంకర్, జె.రమేష్ కుమార్ (నంద్యాల జిల్లా) ఉన్నారు. రాయలసీమ రేంజ్ పరిధిలో 47 మంది ఎస్‌ఐలకు పదోన్నతి లభించంగా.. ఇందులో 2009 బ్యాచ్‌కి చెందినవారు ఎక్కువ మంది ఉన్నారు.

ప్రజలకు మంచి సేవలు అందించండి: సీఐలుగా పదోన్నతి పొందిన పోలీసు అధికారులు గురువారం కర్నూలు బి.క్యాంప్‌లోని రేంజ్ కార్యాలయంలో డీఐజీ సెంథిల్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఐజీ వారిని ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రజల ధన, మాన, ప్రాణాలకు భరోసాగా నిలుస్తూ పారదర్శకత, జవాబుదారీతనం, సత్వర స్పందన, బాధ్యతాయుతమైన సేవలే పరమావధిగా పని చేయాలని సూచించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని సూచించారు.

9 కొత్త కుష్టు కేసుల నమోదు

చాగలమర్రి: నంద్యాల జిల్లాలో కొత్తగా 19 కుష్టు వ్యాధి కేసులు నమోదయ్యాయని జిల్లా టీబీ, కుష్టు వ్యాధుల నివారణ అధికారిణి శారాదాబాయి తెలిపారు. చాగలమర్రి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతేడాది డిసెంబరు 23 నుంచి జనవరి 12వ తేదీ వరకు నిర్వహించిన కుష్టు వ్యాధి సర్వే రికార్డులను పరిశీలించామనానరు. కుష్టు వ్యాధి వల్ల కాళ్లకు స్పర్శ లేని వారికి పరిక్షించి 4 జతల మైక్రో సెల్లులార్ చెప్పులను రోగులకు అందించామన్నారు. ఆమె వెంట వైద్యులు ఇమ్రాన్, అంజలి, డీపీఎంఓ ప్రసాద్, కుష్టు వ్యాధి నోడల్ అధికారి రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆసరా కానుక.. ఆనందాల వేడుక

- పండుగ వాతావరణంలో 'వైఎస్సార్ ఆసరా' సంబరాలు
- జిల్లాలో నాలుగు విడతల్లో పొదుపు మహిళలకు రూ. 669.13 కోట్ల లబ్ధి
- నాడు డ్వాక్రా రుణాల మాఫీ అంటూ మోసం చేసిన చంద్రబాబు
- నేడు మహిళలను లక్షాధికారులను చేసిన సీఎం వైఎస్ జగన్



నంద్యాల పట్టణంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, తదితరులు

నంద్యాల(సిటీ): సంక్షేమ పథకాల దారిలో మహిళల ఆర్థికాభివృద్ధి పరుగులు పెడుతోంది. పేదరికాన్ని రూపుమాపేలా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఇంటికి చేర్చుతుండటంతో పేదల ఇంట ఆర్థిక కాంతులు విరజిమ్ముతున్నాయి. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత, అమ్మ ఒడి తదితర పథకాలతో వారి అభ్యున్నతికి బాటలు వేశారు. అక్కచెల్లెమ్మలకు నేనున్నానంటూ ఎన్నికల ముందు మాటిచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. 2019 ఏప్రిల్ 11 నాటికి స్వయం సహాయక సంఘాల బ్యాంకు లింకేజీ అప్పు నిల్వ మొత్తాన్ని నాలుగు విడతల్లో చెల్లిస్తానని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారు. ఇందుకోసం వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేశారు. జిల్లాలో నాలుగేళ్లలో ఈ పథకం ద్వారా 26,023 పొదుపు సంఘాల గ్రూపుల్లో రూ. 669.13 కోట్లను నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారు. తాజాగా జిల్లాకు నాలుగో విడత ఆసరా నిధులను మంజూరు చేశారు. ప్రభుత్వ తోడ్పాటుతో జిల్లాలో మహిళలు జీవనోపాధులను వృద్ధి చేసుకున్నారు. కొందరు సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్నారు. వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. జ్యూట్ బ్యాగ్‌లు, ఊదిబత్తీలు, జీన్‌పాయింట్ల తయారీలో రాణిస్తున్నారు.

స్వయం సంఘాల్లో సంతోషాల వెల్లువ

నాలుగో విడత వైఎస్సార్ ఆసరా కింద నంద్యాల జిల్లాలో 2,53,077 లబ్ధిదారులకు రూ.167.41 కోట్ల లబ్ధి చేకూరింది. దీంతో వైఎస్సార్ ఆసరా సంబరాలు ఆనందోత్సవాల మధ్య జరుగుతున్నాయి.

టీడీపీ హయాంలో...

మహిళల సంక్షేమానికి ఒక్క పథకం కూడా లేదు. ఉమ్మడి రాష్ట్రానికి 9 ఏళ్లు, విభజిత రాష్ట్రానికి 5 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు మహిళల కోసం అమలు చేసిన పథకం ఒక్కటి కూడా చెప్పలేరు. బ్యాంకులు మహిళలకు లింకేజీ రుణాలు ఇవ్వడం తప్పితే వారి సంక్షేమానికి ప్రత్యేకంగా అమలు చేసింది సున్నానే. 2014 ఎన్నికల సమయంలో డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తాను.. ఎవ్వరూ బ్యాంకు రుణాలు చెల్లించవద్దని చెప్పి..అధికారంలోకి వచ్చాక మహిళలను చంద్రాబాబు మోసం చేశారు. మళ్లీ ఎన్నికలు వస్తుండటంతో కొత్త వాగ్దానాలతో ముందుకు వస్తున్నారు. చంద్రబాబును మహిళలు నమ్మే స్థితిలో లేరు.

వైఎస్సార్‌సీపీ పాలనలో..

మహిళల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. వైఎస్ఆర్ చేయూత కింద 45–60 ఏళ్లలోపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ఏటా రూ.18,750 నేరుగా బ్యాంకు ఖాతాలకే విడుదల చేస్తున్నారు. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, జగనన్న తోడు, వైఎస్ఆర్ సున్నా వడ్డీ కింద జిల్లాలో మహిళలకు ఆర్థిక తోడ్పాటు లభించింది. వైఎస్సార్ ఆసరా కింద 4వ ఏడాది నిధులు నేరుగా ఎస్‌హెచ్‌జీల బ్యాంకు ఖాతాలకే జమ చేస్తుండటంతో స్వయం సహాయక సంఘాల మహిళల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. జిల్లాలో ఏకంగా నాలుగు విడతల్లో 26,023 పొదుపు సంఘాల గ్రూపులకు రూ. 669.13కోట్లను నేరుగా జమ చేశారు.

ఇప్పటి వరకు కార్యక్రమాలు నిర్వహించిన మండలాల్లో ఆసరా ఆర్థిక తోడ్పాటు ఇలా (రూ.కోట్లలో)

మండలం	నాల్గవ విడత ఆసరా	నాలుగేళ్లలో లబ్ధి	లబ్ధి పొందిన సంఘాలు
ఆళ్లగడ్డ	5	19.96	718
గోస్పాడు	5.64	22.57	808
నంద్యాలటౌన్	15.46	61.52	2,454
నంద్యాల	8.30	33.24	1,193

ఇప్పటికే ఐదు మండలాల్లో ఆసరా వారోత్సవాలు ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈనెల 23న ఆళ్లగడ్డ మున్సిపల్ కార్యాలయంలో రాష్ట్ర జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డిల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. 24వ తేదీన నంద్యాల నియోజకవర్గ పరిధిలోని గోస్పాడు మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డితో కలసి ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి లబ్ధిదారులకు మెగా చెక్కును పంపిణీ చేశారు. 25వ తేదీ గురువారం నంద్యాల మున్సిపల్ టౌన్‌హాల్‌లో ఎమ్మెల్యే శిల్పారవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, రాష్ట్ర డైరెక్టర్, అధికారులు నంద్యాల పట్టణ, మండల పొదుపు మహిళలకు మెగా చెక్కును అందజేశారు. అదే రోజు నందికొట్కూరు మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ ప్రశాంతి ఆధ్వర్యంలో మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కును అంద జేశారు. గత నాలుగేళ్ల క్రితమే పొదుపు మహిళలకు ఎన్నికల హామీలో ఇచ్చిన మాట మేరకు వారిని రుణ విముక్తులుగా చేయడంతో అందరిలో ఆనందం నెలకొంది.

బాబు మోసం చేస్తే జగనన్న ఆదుకున్నారు



గత తెలుగు దేశం పాలనలో చంద్రబాబు నాయుడు పొదుపు గ్రూపు రుణాలు మాఫీ చేస్తానని మోసం చేశారు. వడ్డీ కూడా ఇవ్వకుండా నట్టేట ముంచేశారు. చంద్రబాబు మాటలు నమ్మి బ్యాంకుకు డబ్బులు కట్టకపోవడంతో వడ్డీతో సహా కలిపి భరించలేనంత భారం పడింది. సీఎం వైఎస్ జగనన్న ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ ఆసరా పథకం కింద ఆదుకున్నారు. గత మూడు విడతల్లో నాకు రూ. 27 వేలు జమ అయ్యాయి. ఇప్పుడు నాలుగో విడత మరో రూ.9 వేలు వచ్చాయి. – మల్లేశ్వరి, నందికొట్కూరు పట్టణం

జగనన్న రుణం తీర్చుకోలేం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల పక్షపాతి. అందుకే అన్ని సంక్షేమ పథకాలు మహిళలకే పెద్ద పీట వేశారు. వైఎస్సార్ ఆసరా పథకం కింద పొదుపు సంఘాలకు గతంలో చెల్లించిన రుణాలు తిరిగి ఇస్తానని మాట ఇచ్చి నిలబెట్టుకున్నారు. నాకు ఇప్పటి వరకు రూ. లక్ష జమ అయ్యాయి. ఇలాంటి పథకాలు ఏ ముఖ్యమంత్రి చేయలేదు. జగనన్నకు రుణ పడి ఉంటాం. మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి అయితే పేదలను మరింత ఆదుకుంటారనే నమ్మకం ఉంది.

– శాంతకుమారి, నందికొట్కూరు పట్టణం

రూ. 3.6 లక్షలు జమ అయ్యాయి



వైఎస్సార్ ఆసరా ఆర్థికంగా స్థిరపడడానికి ఎంతో దోహదం చేస్తోం. మాది క్రాంతి గ్రూపు, మా గ్రూపులోని మహిళలు స్వయం ఉపాధి పొందుతున్నారు. మా గ్రూపునకు నాలుగు విడతల్లో రూ.3.6 లక్షల జమ అయ్యాయి. శారీ సెంటర్, కుట్టు మిషన్ల నిర్వహణ తదితర వాటి ద్వారా ఉపాధి పొందుతున్నాం. స్వయం ఉపాధితో ఆర్థికంగా బలోపేతం అవుతున్నాం. – ప్రవీణ, రైతునగరం, నంద్యాల

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం



స్టాల్స్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

నంద్యాల: గణతంత్ర దినోత్సవ వేడుకలకు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం ముస్తాబైంది. వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. శుక్రవారం ఉదయం 9గంటలకు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ జాతీయ పతాకావిష్కరణతో కార్యక్రమం మొదలు కానుంది. అనంతరం కలెక్టర్ గణతంత్ర దినోత్సవ సందేశం, సాయుధ దళాల మార్చ్‌ఫాస్ట్, వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అలాగే విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ఈ సందర్భంగా ఉత్తమ సేవా ప్రశంస పత్రాలను



గణతంత్ర దినోత్సవానికి సిద్ధమైన వేదిక

ప్రదానం చేసేందుకు అంతా సిద్ధం చేశారు. జిల్లా ప్రగతిని చాటేలా శకటాల ప్రదర్శన, స్టాళ్లను తీర్చిదిద్దారు. అలాగే స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను సన్మానించనున్నారు.

గ్రామీణం.. ఆర్థికంగా బలోపేతం

- స్థానిక సంస్థలకు రూ.85.14 కోట్ల నిధులు విడుదల
- సింహ భాగంగా 970 గ్రామ పంచాయతీలకు రూ.59.56 కోట్లు
- జెడ్పీ, మండల పరిషత్‌లకు మిగిలిన 30 శాతం
- 15వ ఆర్థిక సంఘం 2వ విడత టైడ్, గ్రాంట్లు విడుదల
- గ్రామ పంచాయతీ పీఎఫ్‌ఎంఎస్ ఖాతాల్లో నిధులు జమ
- పారిశుద్ధ్యం, తాగునీరు, ఇతరత్రా అభివృద్ధి పనులకు ప్రాధాన్యం

కర్నూలు(అర్బన్): గ్రామ పంచాయతీలు ఆర్థికంగా బలోపేతం అయ్యాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాకు 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు రూ.85.14 కోట్లు విడుదలయ్యాయి. ఇందులో సింహ భాగం (70 శాతం) నిధులు ఉమ్మడి జిల్లాలోని 970 గ్రామ పంచాయతీలకు రూ.59.56 కోట్లు కేటాయించారు. మిగిలిన 30 శాతం నిధులు (రూ.25.58 కోట్లు) జిల్లా పరిషత్‌కు, 53 మండల పరిషత్‌లకు మంజూరు చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 973 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కర్నూలు జిల్లాలోని మండగిరి, సాదాపురం, నంద్యాల జిల్లాలోని సున్నిపెంట గ్రామ పంచాయతీలకు పలు కారణాలతో ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో ఈ మూడు గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల కాలేదు. ఇక మిగిలిన 970 గ్రామ పంచాయతీలకు 2వ విడత బేసిక్, టైడ్ గ్రాంట్లతో పాటు మొదటి విడత వడ్డీ కలిపి మొత్తం రూ.59,56,24,824 విడుదలయ్యాయి. ఈ నిధులు నేరుగా ఆయా గ్రామ పంచాయతీలకు సంబంధించిన యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఖాతాల్లో పీఎఫ్ఎంఎస్ (పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) ద్వారా జమ అయ్యాయి. ఈ నిధులతో పల్లె ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు, తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఉపయోగించనున్నారు.



జెడ్పీ భవనం

వడ్డీ కింద రూ.78.18 లక్షలు

15వ ఆర్థిక సంఘం మొదటి విడత నిధులకు సంబంధించిన బేసిక్, టైడ్ గ్రాంట్లకు వడ్డీ కింద 970 గ్రామ పంచాయతీలకు రూ.54,69,135, జిల్లా పరిషత్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని 53 మండల పరిషత్‌లకు రూ.23,49,453 విడుదలయ్యాయి. వడ్డీ కింద విడుదలైన ఈ నిధుల్లో పీఎఫ్‌ఎంఎస్ ద్వారా గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ కాగా, మిగిలిన నిధులు మండల పరిషత్‌లకు సర్దుబాటయ్యాయి.

స్థానిక అవసరాలకు పెద్ద పీట ...

15వ ఆర్థిక సంవత్సరం నిధులు విడుదల కావడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని స్థానిక అవసరాలకు పెద్ద పీట వేయనున్నారు. టైడ్ గ్రాంట్‌కు సంబంధించిన నిధుల్లో 50 శాతం నిధులను పారిశుద్ధ్యానికి, మిగిలిన 50 శాతం నిధులను తాగునీటి అవసరాలు తీర్చేందుకు వెచ్చించుకోవాల్సి ఉంది. వేసవి రాక ముందే గ్రామ పంచాయతీలకు ఈ నిధులు విడుదల కావడం వల్ల పల్లెల్లో ఎలాంటి తాగునీటి ఇబ్బందులు లేకుండా వివిధ రకాల పనులు చేపట్టే అవకాశం ఏర్పడింది. అలాగే బేసిక్ గ్రాంట్‌తో పలు అభివృద్ధి (సీసీ రోడ్లు, డ్రైన్లు, ఇతరత్రా) పనులు చేపట్టేందుకు మార్గం సుగమం అయ్యింది.

మండల పరిషత్‌లకు సర్దుబాటయ్యాయి



15వ ఆర్థిక సంఘం 2వ విడత నిధులు, మొదటి విడతకు సంబంధించిన వడ్డీ కలిపి ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని 53 మండల పరిషత్‌లకు సర్దుబాటయ్యాయి. సీపీఆర్ నుంచి నేరుగా ఆయా మండలాలకు చెందిన బ్యాంకు ఖాతాల్లో రూ.12.79 కోట్లు జమ అయ్యాయి. ఈ నిధులను ప్రభుత్వ నిబంధనల మేరకు ఖర్చు చేయాల్సి ఉంది. జెడ్పీకి విడుదలైన రూ.12.79 కోట్లను కూడా జెడ్పీ చైర్మన్ అనుమతితో తాగునీటి అవసరాలతో పాటు పలు అభివృద్ధి పనులకు వెచ్చించనున్నాం.

–జీ నాసరరెడ్డి, జెడ్పీ సీఈఓ

నిధులు ఖర్చు చేసేందుకు చర్యలు



గ్రామ పంచాయతీలకు విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వెంటనే ఖర్చు చేసేందుకు చర్యలు చేపట్టాలి. టైడ్ గ్రాంట్‌తో పారిశుద్ధ్యం, తాగునీటి అవసరాలు తీర్చాల్సి ఉంది. బేసిక్ గ్రాంట్‌తో పల్లెల్లో అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. ఈ నిధులు ఖర్చు చేసిన వెంటనే 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నిధులు విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయి.

– టీ నాగరాజునాయుడు, జిల్లా పంచాయతీ అధికారి

పంచాయతీలకు గ్రాంట్ల వారీగా విడుదలైన నిధులు (రూ.ల్లో)

గ్రాంట్	కర్నూలు	నంద్యాల	మొత్తం
టైడ్	18,81,37,861	16,71,88,578	35,53,26,439
బేసిక్	12,43,37,141	11,04,92,109	23,48,29,250
ఇంట్రెస్ట్ నిధులు	28,95,783	25,73,352	54,69,135
మొత్తం:	31,53,70,785	28,02,54,039	59,56,24,824

ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైనది



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ, ఎస్పీ రఘువీర్‌రెడ్డి తదితరులు



ర్యాలీకి హాజరైన ఓటర్లు, విద్యార్థులు

- 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోండి
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైనది అని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో 14వ జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలను జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్ఓ పుల్లయ్యలు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వచ్చే ఎన్నికల్లో 84 శాతం ఓట్లు పోల్ అయ్యే లక్ష్యాన్ని కలెక్టర్ నిర్దేశించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో నిష్పక్షపాతంగా ఓటింగ్ ప్రక్రియకు జిల్లా యంత్రాంగం అన్ని పటిష్ఠ చర్యలు తీసుకుంటుందన్నారు. గత ఆరు నెలల నుంచి స్పష్టమైన పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనకు కృషి చేశామన్నారు. ఈ జాబితాలో చెంచుగూడెంలలోని ఓటర్లు, దివ్యాంగ ఓటర్లు, సీనియర్ సిటిజన్ ఓటర్లను చేర్చామన్నారు. ఏ కార్యక్రమం విజయవంతం కావాలన్నా యువతే ప్రధాన పాత్ర పోషిస్తుందని, ఈ మేరకు యువ ఓటర్లు ఓటింగ్ ప్రక్రియలో పాల్గొని మంచి నాయకున్ని ఎన్నుకోవాలన్నారు. 18 ఏళ్లు దాటిన యువతీ యువకులు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఓటరుగా దరఖాస్తు చేసుకొని నమోదు కావాలన్నారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఓటు అనేది భవిష్యత్తును నిర్ణయిస్తుందని, ఓటు హక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఓటు హక్కును వినియోగించుకుంటున్న 101 సంవత్సరాల సీనియర్ సిటిజన్ సుబ్బన్నను జిల్లా కలెక్టర్ శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఓటరుగా కొత్తగా నమోదైన యువ ఓటర్లకు, వికలాంగత్వ ఓటర్ కు ఎపిక్ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఈఆర్ఓ అనురాధ, నియోజకవర్గాల స్పెషల్ అధికారులు, కమిటీల నోడల్ అధికారులు, డీఈఓ సుధాకర్ రెడ్డి, కళాశాల, పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు, సీనియర్ సిటిజన్లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటేస్తాం..

'భారత దేశ పౌరులమైన మేము, ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో, మన దేశ ప్రజాస్వామ్య సాంప్రదాయాలను, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రభావాన్ని నిలబెడతామనీ, మతం, జాతి, కులం, వర్గం, భాష లేదా ఎటువంటి ఒత్తిడిలకు ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికలో నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకుంటామని నంద్యాల ఓటర్లు ప్రతిజ్ఞ చేశారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం బొమ్మల సత్రం బ్రిడ్జ్ టీ జంక్షన్ ప్రాంతంలో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్ఓ పుల్లయ్యలు ఓటర్ల చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై చైతన్య అవగాహనా ర్యాలీని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అలాగే రామలింగారెడ్డి డిగ్రీ కాలేజ్ దగ్గర నుంచి జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ నుంచి జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డిలు ఓటర్ల చైతన్య అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీలో కళాశాల, పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారందరి చేత ఓటరుగా నమోదు అవుతామని ఓటు హక్కును వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఎస్పీ వెంకట రాముడు, జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, మున్సిపల్ కమిషనర్ రవి చంద్రారెడ్డి, డీఈఓ సుధాకర్ రెడ్డి, నంద్యాల నియోజకవర్గ ఈఆర్వో అనురాధ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కులగణన సర్వే



కొలిమిగుండ్ల మండల కేంద్రంలో తెల్లవారుజామున సర్వే చేస్తున్న వలంటీర్

నంద్యాల(అర్బన్): నంద్యాల జిల్లాలో కులగణన సర్వే కొనసాగుతుంది. ఇప్పటి వరకు 3,91,469 కుటుంబాలకు సంబంధించిన 9,26,395 మందికి సంబంధించిన సర్వే పూర్తయ్యిందని డీఎల్‌డీఓ మురళీ కల్యాణి గురువారం తెలిపారు. మొత్తం మీద 65.82 శాతం సర్వే పూర్తయ్యిందని, సకాలంలో సర్వే పనులు పూర్తయ్యేలా చర్యలు చేపడుతున్నామన్నారు.

ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ

బొమ్మలసత్రం: ఎన్‌జీవోస్ కాలనీలో నివాసముంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు సురేంద్ర ఇంట్లో చోరీ జరిగింది. గురువారం ఉదయం ఉపాధ్యాయుడు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాడు. కొద్దిసేపటి తిరిగి రాగానే తాళం తీసి ఉండటాన్ని గమనించి ఇంట్లోకి వెళ్లి చూశాడు. ఇంట్లో ఉన్న బీరువాలో 6 తులాల బంగారు ఆభరణాలు, 450 గ్రాముల వెండి వస్తువులు కనిపించకుండా పోయాయి. పోలీసులకు సమాచారం అందించటంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దొంగ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ఇళ్ల స్థలాలపై పేదలకు సర్వ హక్కులు

- రిజిస్ట్రేషన్ చేసి కన్వెడ్ పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు
- జనవరి 27 నుంచి ఫిబ్రవరి 9వరకు రిజిస్ట్రేషన్లకు చర్యలు
- పేదల తరఫున రిజిస్ట్రేషన్‌లు చేసి ఇవ్వనున్న వీఆర్వోలు
- జిల్లాలో 1,08,953 మందికి ఇళ్ల పట్టాలు



కర్నూలులో పేదలు ఇచ్చిన ఇళ్ల స్థలాలు(ఫైల్)

కర్నూలు(సెంట్రల్): గణతంత్ర దినోత్సవం సందర్భంగా పేదలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభవార్త చెప్పారు. వారు పొందిన ఇళ్ల స్థలాలపై సర్వ హక్కులు కల్పించేందుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వం నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ఇచ్చిన ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి లబ్ధిదారులకు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం గ్రామ, వార్డు సచివాలయాలను జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుగా మార్చబోతున్నారు. ఈనెల 27 నుంచి ఫిబ్రవరి 9వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

అసైన్‌మెంట్ చట్టంలో మార్పులు

కర్నూలు జిల్లాలో 1,08,953 మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారు. మొత్తం 344 వైఎస్సార్ జగనన్న కాలనీలు నిర్మాణంలో ఇన్నాయి. జగనన్న కాలనీలు, ఇతర ప్రదేశాల్లో ఇంటి పట్టాలు పొందిన వారు, సొంత స్థలాలు ఉన్న వారిలో మొత్తం 40,815 మందికి ఇళ్లను నిర్మించుకోవడానికి అనుమతులు మంజూరు చేశారు. ఇప్పటి వరకు 16 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. జనవరి ఆఖరు నాటికి మరో 12 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి కానున్నాయి. ఈ క్రమంలో పేదలు పొందిన ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి హక్కులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇళ్ల స్థలాల కోసం ఇచ్చిన డిపట్టాలపై లబ్ధిదారులకు హక్కులు ఉండవు. కేవలం వారు అనుభవించడానికి మాత్రమే అవకాశం ఉంటుంది. ఆపద సమయాలు, అత్యవసర వేళల్లో వాటిని అమ్ముకోవడం, కుదువ పెట్టుకొని ఆర్థిక ఇబ్బందుల నుంచి బయట పడేందుకు అవకాశం ఉండదు. ఈ క్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఇచ్చిన డి పట్టాలపై సర్వ హక్కులు కల్పించేందుకు అసైన్‌మెంట్ చట్టంలో మార్పులు చేశారు. అందులో భాగంగా పదేళ్లకు డి పట్టాలు పొందిన వారికి సర్వ హక్కులు కల్పించారు. ఈ క్రమంలో ఐదేళ్ల తరువాత మొదట కన్వెయన్స్ డీడ్‌లు వారికి లభిస్తాయి. మరో ఐదేళ్ల తరువాత ఆటోమేటిక్ సేల్స్ డీడ్‌లుగా కన్వెయన్స్ డీడ్‌లు మారిపోయేలా చర్యలు తీసుకుంటున్నారు.

సచివాలయాల్లోనే ప్రక్రియ అంతా పూర్తి

ఈనెల 27 నంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు కానుంది. ప్రభుత్వం తరఫున వీఆర్వో పేదలకు రిజిస్ట్రేషన్ చేస్తారు. ఇందు కోసం గ్రామ, వార్డు సచివాలయాలను జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుగా మార్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. పంచాయతీ కార్యదర్శులు, వార్డు పరిపాలన కార్యదర్శులు జాయింట్ సబ్‌రిజిస్ట్రార్లుగా వ్యవహరిస్తారు. రెవెన్యూ అధికారులు ప్రభుత్వం పంపిణీ చేసిన ఇళ్ల పట్టాలు డేటా, లబ్ధిదారుల వివరాలు, వారికి కేటాయించిన ప్లాట్లు, వాటి నంబర్లు, హద్దులు పరిశీలించి రిజిస్ట్రేషన్ల కోసం సిద్ధం చేయాల్సి ఉంటుంది. జాయింట్ కలెక్టర్లు, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలను సందర్శించి చిక్షేత్ర స్థాయిలో అన్ని ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. పేదలకు ఇచ్చే కన్వేయన్స్ డీడ్‌లో వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో సరి చూసి రిజిస్ట్రేషన్లను చేయాల్సి ఉంటుంది.

గొప్ప ముందడుగు

చాలా ఏళ్ల క్రితం ఇచ్చిన డి-పట్టాలను క్రమబద్ధీకరించుకోవడం ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతో కష్టం. అందుకు రెవెన్యూ శాఖ ఎన్‌ఓసీ ఇవ్వడం, ఆ తరువాత రిజిస్ట్రేషన్ శాఖ దాన్ని మార్చే ప్రక్రియ చేయడంతో ఎంతో క్లిష్టమైన అంశం. ఈక్రమంలో ఆప్లాట్లను పేదలు ఎంతో కొంతకు అమ్ముకొని వెళ్లేవారు. మార్కెట్ రేటు ఎంత ఉన్నా చాలా తక్కువకు అమ్మాల్సి వచ్చేది. దీంతో వారు ఆ ఆస్తి హక్కులు కోల్పోవడంతోపాటు తక్కువకు అమ్ముకోవడంతో వారు కష్టాలు కూడా తీరివేవి కావి. ఈక్ర మంలో పేదల పట్టాలను రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం వారికి పెద్ద ఆస్తిని ఇచ్చినట్లు అవుతుంది. ఇది గొప్ప ముందడుగా ప్రజలు భావిస్తున్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



పేదల ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. గ్రామ, వార్డు సచివాయాలయాలనే జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాయలయాలుగా మార్చబోతున్నాం. డిపట్టా రిజిస్ట్రార్‌లో ఉన్న ప్రతి లబ్ధిదారుడి పట్టాను రిజిస్ట్రేషన్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రేపటి నుంచి ఫిబ్రవరి 9వ తేదీ వరకు పేదల డి పట్టాలు రిజిస్ట్రేషన్ అవుతాయి. ఈ ప్రక్రియ సజావుగా సాగేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నాం.

–నారపురెడ్డి మౌర్య, జేసీ

చేతికొచ్చిన పంట బుగ్గిపాలు

- దిగుబడులకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు
- రూ. 15 లక్షల ఆస్తి నష్టం

ఉయ్యాలవాడ: కొండుపల్లె గ్రామంలో గుర్తు తెలి య ని వ్యక్తుల నిర్వాకానికి రైతుల కష్టం బుగ్గిపాలైంది. గ్రామానికి చెందిన అంబటి శేఖర్‌రెడ్డి సాగు చేసి న 5 ఎకరాల జొన్నపంట, పాణ్యం వెంకటేశ్వరమ్మకు చెందిన 4 ఎకరాలు పొగాకు దిగుబడులు, కమ్మరి రవికుమార్ ఆచారి, విశ్వనాథరెడ్డిలకు చెందిన 5.10 ఎకరాల్లో కంది పంటను నూర్పిడి చేసేందుకు పొలంలో సిద్ధంగా ఉంచిన కోత కోసి పైరుకు గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి సమయంలో నిప్పుపెట్టారు. బాధి త రైతులు ఉదయాన్నే పొలాల కు వెళ్లిచూడగా వివిధ ప్రాంతాల్లో వున్న దిగుబడులంతా కాలిబూడిద కావడంతో కన్నీటి పర్యంతమయ్యారు. సుమారు రూ. 15 లక్షలు పైగా నష్టం వాటిల్లినట్లు రైతులు పేర్కొంటున్నారు.జరిగిన సంఘటనను ఉయ్యాలవాడ పోలీ స్ స్టేషన్‌లో రైతులు ఫిర్యాదు చేయడంతో కేసు నమో దు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు. వేర్వేరు చోట్ల ఉన్న పంట దిగుబడులు అగ్నికి ఆహూ తి కావడంపై పలు అనుమానాలకు తావిస్తోంది.



పొగాకు దిగుబడులు కాలిపోవడంతో రోదిస్తున్న మహిళా రైతు వెంకటేశ్వరమ్మ



బూడిదయిన కంది పంటను పరిశీలిస్తున్న వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు

రైతులకు పరామర్శ..

పంటలు అగ్నికి ఆహూతి అయి నష్టపోయిన రైతులను వైఎస్‌ఆర్‌సీపీ మండల అధ్యక్షుడు బుద్దా చంద్రమోహన్ రెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గజ్జెల క్రిష్టారెడ్డి, సర్పంచ్ పల్లె గురుప్రసాద్‌రెడ్డి, మాజీ గ్రామ సర్పంచ్ ఆరికట్ల శివరామక్రిష్టారెడ్డిలు గురువారం గ్రామానికి చేరుకుని గ్రామ వైఎస్‌ఆర్‌సీపీ నాయకుడు అంబటి తులసిరెడ్డితో కలిసి కాలిబూడిదయిన దిగుబడులను పరిశీలించారు. బాధిత రైతులతో జరిగిన సంఘటనపై ఆరా తీశారు. బాధిత రైతులకు జరిగిన అన్యాయాన్ని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం నుండి నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని రైతులను పరామర్శించారు.

డీసీఎంఎస్‌ల అభివృద్ధికి చర్యలు



డీసీఎంఎస్ చైర్ పర్సన్ శిరోమణితో ఐసీఎం ఫ్యాకల్టీ

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్రంలో జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీల (డీసీఎంఎస్‌ల) అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఇండియన్ కో-ఆపరేటివ్ మేనేజ్‌మెంటు(ఐసీఎం) ఫ్యాకల్టీ శ్యామ్‌కుమార్, రామన్ తెలిపారు. ఇందులో భాగంగా అన్ని జిల్లాల్లో పర్యటిస్తూ డీసీఎంఎస్‌ల బిజినెస్ డెవలప్‌మెంట్ ప్లాన్‌లను తీసుకుంటున్నట్లుగా పేర్కొన్నారు. గురువారం ఐసీఎం ఫ్యాకల్టీ కర్నూలు డీసీఎంఎస్ చైర్‌పర్సన్ సీహెచ్ శిరోమణి మద్దయ్య, బిజినెస్ మేనేజర్ రాజేష్‌తో సమావేశమై బిజినెస్ డెవలప్‌మెంటు ప్లాన్‌పై చర్చించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ శిరోమణి మద్దయ్య మాట్లాడుతూ... అంగన్‌వాడీ సెంటర్లకు సరఫరా చేసే అన్ని రకాల వస్తువుల బాధ్యతను డీసీఎంఎస్‌కు అప్పగించాలన్నారు. అదే విధంగా విద్యార్థులకు అవసరమైన నోట్స్‌లు, పాఠ్య పుస్తకాలతో పాటు ఇతర వస్తువులను డీసీఎంఎస్ ద్వారానే సరఫరా చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. కర్నూలులోని డీసీఎంఎస్ ప్రధాన కార్యాలయానికి అధునాతన భవనం, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని కోరారు. ఐసీఎం ఫ్యాకల్టీ శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ... కర్నూలు డీసీఎంఎస్ అభివృద్ధికి సంబంధించి బిజినెస్ డెవలప్‌మెంటు ప్లాన్‌ను రాష్ట్ర సహకార శాఖ కమిషనర్‌కు సమర్పిస్తామన్నారు.

వైభవంగా శ్రీశైలగిరి ప్రదక్షిణ



స్వామిఅమ్మవార్ల పల్లకీని శ్రీశైల గిరిప్రదక్షిణకు తీసుకెళ్తున్న ఆలయ అధికారులు

శ్రీశైలంటెంపుల్: పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం సాయంత్రం శ్రీశైల గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. సాయంత్రం మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయ మహాద్వారం నుంచి మొదలైన పల్లకీ ఊరేగింపు గంగాధర మండపం, అంకాళమ్మగుడి, నందిమండపం, గంగాసదనం, బయలువీరభద్రస్వామి ఆలయం, రింగ్‌రోడ్డు, ఫిల్టర్‌బెడ్, సిద్దరామప్పకొలను, పుష్కరిణి వద్దకు చేరుకుంది. అక్కడి నుంచి తిరిగి నందిమండపం, ఆలయ మహాద్వారం వద్దకు చేరుకుంది. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. శ్రీశైల గిరిప్రదక్షిణ కార్యక్రమంలో ఆలయ అధికారులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

తనిఖీలు ముమ్మరం



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

బొమ్మలసత్రం: జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో తనిఖీలు ముమ్మరం చేసినట్లు జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ స్వార్తిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కార్డన్ సెర్చ్ నిర్వహించడంతో పాటు, మద్యం అక్రమ రవాణా, నాటుసారా స్థావరాలపై ఎప్పటికప్పుడు దాడులు చేస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో భాగంగా 16 బైండోవర్ కేసులు, 18 ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేశామన్నారు. సారా స్థావరాలపై విస్తృత దాడులు నిర్వహించి 7 కేసులు నమోదు చేసి, 8 మందిని అదుపులోకి తీసుకుని 15 లీటర్ల సారా, 200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశామన్నారు. ఐదు డీపీల్ కేసులు నమోదు చేసి 113 మద్యం బాటిళ్లు సీజ్ చేశామన్నారు. శిరివెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న 4 ట్రాక్టర్లుసీజ్ చేసి, 28 టన్నుల ఇసుక సీజ్ చేసి, ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశామన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 13 కేసులు నమోదు చేశామన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. పలు మార్లు కేసుల్లో అరెస్ట్ అయిన వారు ప్రవర్తన మార్చుకోకపోతే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఏఆర్ కానిస్టేబుల్ మృతి

కర్నూలు: కల్లూరులోని గోపీనగర్‌లో నివాసముంటున్న ఏఆర్ కానిస్టేబుల్ షేక్ అలీ సాహె బ్ (51) నిద్రలో మంచంపై నుంచి నేలపై ప డి గాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. ఈయన జిల్లా పోలీసు శాఖలోని ఏఆర్ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. డిసెంబర్ 5వ తేదీన ఇంట్లో మంచంపై పడుకుని నిద్రలో నేలపై పడటంతో తలకు బలమైన గాయమయ్యింది.108 అంబులెన్స్ లో ఆసుపత్రికి తరలించి వైద్యచికిత్సలు చేయించగా కోలుకోలేక బుధవారం రాత్రి మృతిచెందాడు. మంచంపై నుంచి కింద పడటం వల్లే గాయాలకు గురై మృతి చెందినట్లు భార్య షేక్ ముంతాజ్ బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాల్గో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి



పాములపాడు: కుక్కల దాడిలో ఓ చుక్కల దుప్పి మృతి చెందిన సంఘటన ఎర్రగూడూరులో గురువారం చోటు చేసుకుంది. ఆహార అన్వేషణలో అటవీ ప్రాంతం నుంచి మైదాన ప్రాంతానికి చేరుకున్న దుప్పిని కుక్కలు వెంబడించి దాడి చేశాయి. తీవ్ర గాయాల పాలై దుప్పి గ్రామంలో ఓ చోట మృతి చెంది కనిపించడంతో స్థానికుల సమాచారంతో వెలుగోడు అటవీ అధికారులు గోపి, సుజాత గ్రామానికి చేరుకుని దుప్పి కళేబరాన్ని పరిశీలించారు. కళేబరాన్ని అటవీ ప్రాంతానికి తరలించి అటవీశాఖ వైద్యుడు డాక్టర్ సుభేర్ పోస్టుమార్టం చేసిన అనంతరం అక్కడే దహనం చేశారు.

గ్యాస్ట్రో ఎంట్రాలజీ పరీక్షలో గోల్డ్‌మెడల్



ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరంగారెడ్డితో డాక్టర్ రాకేష్‌రెడ్డి, డాక్టర్ బిలాల్

కర్నూలు(హాస్పిటల్): గ్యాస్ట్రో ఎంట్రాలజీ సూపర్‌స్పెషాలిటీ డీఎం పరీక్షలో కర్నూలు విద్యార్థులు గోల్డ్‌మెడల్ సాధించారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో సూపర్‌స్పెషాలిటీ పీజీ కోర్సులో మొదటి బ్యాచ్‌లో చేరిన డాక్టర్ రాకేష్‌రెడ్డి, డాక్టర్ షేక్ బిలాల్ మొహిద్దీన్ డాక్టర్ వైఎస్‌ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వారు ఇటీవల వైజాగ్‌లో నిర్వహించిన వార్షిక పరీక్షలో అత్యధిక మార్కులు సాధించి స్టేట్ టాపర్‌లుగా నిలిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్‌వోడీ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి ఇచ్చిన ప్రోత్సాహం, శిక్షణ వల్లే తమకు బంగారు పతకం లభించినట్లు వారు పేర్కొన్నారు. వీరిని గురువారం తన చాంబర్‌లో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ హేమనళిని తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలి

- ఎంవీఐ మనోహర్ రెడ్డి



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ మనోహర్‌రెడ్డి

కర్నూలు: అతివేగం ప్రమాదకరమని, రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించి సురక్షితంగా గమ్యానికి చేరుకోవాలని మోటార్ వాహన తనిఖీ అధికారి మనోహర్‌రెడ్డి వాహనదారులకు సూచించారు. 'రోడ్డు భద్రత – జీవితానికి రక్ష' పేరుతో జిల్లాలో రవాణా శాఖ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 19వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రవాణా శాఖ డిప్యూటీ కార్యాలయానికి ఫిట్‌నెస్, డ్రైవింగ్ లైసెన్స్, ఎల్‌ఎల్‌ఆర్ తదితర వాటి కోసం వచ్చిన వారిని సమావేశపరచి రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మోటర్ వాహనాల తనిఖీ అధికారి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ద్విచక్ర వాహన ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురైన కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉంటుందని, అలాంటి పరిస్థితులు ఉత్పన్నం కాకుండా వాహనం తోలేటప్పుడు కుటుంబ సభ్యులను గుర్తు చేసుకోవాలని సూచించారు. సుమారు 150 మంది దాకా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘాట్‌రోడ్డులో దారిదోపిడీ

మహానంది: నంద్యాల–గిద్దలూరు మార్గంలో నల్లమల ఘాట్ రోడ్డులో జరిగిన దోపిడీ జరిగింది. నంద్యాలకు చెందిన ఓ హోల్‌సేల్ వ్యాపారి వస్తువుల కొనుగోలుకు విజయవాడకు ఇన్నోవా కారులో వెళ్తుండగా బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గాజులపల్లె సమీపంలో వాహనం ఆపి బెదిరించి సుమారు రూ. 4 లక్షలు దోచుకెళ్లినట్లు సమాచారం . ఈ మేరకు బాధితుడు విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ దర్యాప్తు చేస్తున్నారు. బాధితుడు తన పేరు బయటికి చెప్పేందుకు నిరాకరించినట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా నంద్యాల నుంచి వ్యాపారికి తెలిసిన వారే అనుసరించి ఈ దోపిడీకి పాల్పడినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కర్నూలు సర్కిల్‌కు 'ఉత్తమ' అవార్డు

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూటరీ కంపెనీ లిమిటెడ్(ఏపీఎస్‌పీడీసీఎల్) కర్నూలు సర్కిల్‌కు బెస్ట్ అవార్డు లభించింది. రాయలసీమతో పాటు నెల్లూరు జిల్లాల్లో కర్నూలు సర్కిల్‌కు ఐదు పారామీటర్లలో ఈ అవార్డును సొంతం చేసుకుంది. విద్యుత్ బిల్లులను 100 శాతం వసూలు చేయడం, వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదుల ను సత్వరం పరిష్కరించడం, ట్రాన్స్‌ఫార్మర్ల పెయిల్యూర్స్‌ను తగ్గించడం, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు సకాలంలో ఇవ్వడం, విద్యుత్ అంతరాయాలను తగ్గించడం అంశాల్లో ప్రగతి కనబరిచినందుకు ఈ అవార్డు వచ్చిందని ఎస్‌ఈ ఎం.ఉమాపతి తెలిపారు. గణతంత్రదినోత్సవం సందర్భంగా తిరుపతిలో జరిగే కార్యక్రమంలో సీఎండీ సంతోష్‌రావు చేతుల మీదగా అవార్డు అందుకోనున్నట్లు ఆయన చెప్పారు. కాగా ఇటీవల సంభవించిన మిచాంగ్ తుపాను సమయంలో వాకాడు, నెల్లూరు, గూడూరు ప్రాంతాలకు వెళ్లి సేవలు అందించినందుకు గుర్తింపుగా ఎస్‌ఈ ఉమాపతికి మరో అవార్డు కూడా లభింభించింది. ఈ అవార్డు విజయవాడలో జరిగే కార్యక్రమంలో ట్రాన్స్‌కో సీఎండీ విజయానంద్ చేతుల మీదుగా అందుకోనున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్‌ను గణనీయంగా తగ్గించినందుకు బెస్ట్ సబ్ డివిజన్ అవార్డును కర్నూలు –1 డిప్యూటీ ఈఈ రాజమోహన్‌రెడ్డి, వందశాతం విద్యుత్ బిల్లులు వసూలు చేసినందుకు బెస్ట్ సబ్ డివిజన్ అవార్డును కోవెలకుంట్ల డిప్యూటీ ఈఈ/ఓఎస్‌డీ ఖాజావలి, వినియోగదారుల పిర్యాదులను సకాలంలో పరిష్కరించినందుకు డోన్ ఏఈ రమేష్, బెస్ట్ డీపీఇ డివిజన్ అవార్డును ఈఈ ప్రదీప్‌కుమార్, బెస్ట్ కన్స్ట్రక్షన్ అవార్డును ఈఈ రాజేష్, బెస్ట్ ఏవో అవార్డును హనుమంతురావు అందుకోనున్నారు.

ఎమ్మార్పీ లేని వస్తువుల విక్రయం

- కంప్యూటర్, మొబైల్ షాపులపై కేసుల నమోదు
- రూ.1.35 లక్షల అపరాధ రుసుం వసూలు



అబ్దుల్లాఖాన్ ఎస్టేట్‌లో కంప్యూటర్ షాపులో తనిఖీ చేస్తున్న తూనికలు కొలతల శాఖ అధికారులు

కర్నూలు (న్యూటౌన్)/ కర్నూలు : నగరంలోని కంప్యూటర్, మొబైల్ షాపుల్లో ఎంఆర్‌పీ లేని వస్తువులు విక్రయిస్తుండడంతో 14 కేసులు నమోదు చేసి రూ.1.35 లక్షలు జరిమానా విధించినట్లు తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్‌కుమార్ తెలిపారు. గురువారం నగరంలోని కేఈ ప్లాజా, అబ్దుల్లాఖాన్ ఎస్టేట్ పరిసర ప్రాంతాల్లోని కంప్యూటర్, మొబైల్ షాపుల్లో తనిఖీలు చేశామన్నారు. తయారీదారుల చిరునామా లేకుండా, ఎమ్మార్పీ, కన్జూమర్ కేర్ నంబర్ లేకుండా కంప్యూటర్లు, మొబైల్స్, కేబుల్స్ విక్రయిస్తే చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో తూనికలు కొలతల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.